

జిల్లా అభివృద్ధి పట్టని ప్రభుత్వం

• ప్రజలపై భారాలు మోపడమే పాలకుల పనా..? • సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/హాస్పిటల్

కర్నూలు జిల్లా అభివృద్ధి గురించి ప్రభుత్వం ఏమైనా ఆలోచిస్తోందా అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ ప్రశ్నించారు. సిపిఎం న్యూ సిటీ నగర మహాసభ సందర్భంగా చెన్నమ్మ సర్కిల్లో సోమవారం సాయంత్రం సిపిఎం న్యూ సిటీ నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ భారతదేశంలో అక్రమ వ్యాపారస్తులను ప్రోత్సహించే ప్రభుత్వం కేంద్రంలో ఉందన్నారు. దేశ చరిత్రలో ఇంత నగ్నంగా దోచుకున్న వ్యాపారస్తులు లేరని, మోడీ బరితెగించి పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం పోతే తప్ప దేశానికి రక్షణ లేదన్నారు. అదానీ నుంచి జగన్ లంచం తీసుకున్నారని, సన్మానం చేయాలని జగన్ అడుగుతున్నారని, చంద్రబాబు ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ వెనుక మోడీ అమిత్‌షా ఉన్నారని, రద్దుచేసే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. దేశాన్ని పెద్ద గద్దలు కొల్లగొడుతున్నాయన్నారు. ప్రభుత్వాలు వారికి ఏజెంట్లుగా మారాయని, అందుకే ప్రజలపై భారాలు పడుతున్నాయని తెలిపారు. కష్టించి పంట పండించిన రైతులు అప్పులపాలు అవుతున్నారని, గిట్టుబాటు ధర ఇవ్వడం ప్రభుత్వం బాధ్యత అని తెలిపారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పుడు గుండ్రేవుల కడతామని, హంద్రీనీవా పూర్తి చేస్తామని, రాయలసీమ సస్యమలం చేస్తామని తెలిపారని, పదేళ్లుగా గుండ్రేవులకు తట్టెడు మన్ను వేయలేదని తెలిపారు. తాగునీరు లేక గ్రామాలు వదిలిపెడుతున్నారన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ ఇస్తామని చెప్పిన కేంద్రంతో మాట్లాడి కనీసం 10,000 మందికి ఉపాధి కల్పించగలరా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం దారి తప్పుతోందని ఎద్దేవా చేశారు. అన్నదమ్ముళ్లా జీవిస్తున్న ప్రజల మధ్య కేంద్రం చిచ్చు పెడుతోందని, మతం పేరుతో కల్లోలం సృష్టిస్తున్నారని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పోరాటం సాగిస్తామన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని, ఇచ్చిన మాటపై నిలబడే తత్వం ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ధరలు అదుపు చేస్తామని చెప్పి మద్యం ధరలు తగ్గించి నూనె ధరలు పెంచుతున్నారని, ఇదెక్కడి పాలనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడో చిత్తు సిలిండర్లో అంటూ ఈ ఏడాది ఒక్క సిలిండర్తో సరిపెడుతున్నారని, నిరుద్యోగులను డిఎస్‌సి అంటూ మోసం చేస్తున్నారని, రైతులకు ఇప్పటివరకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని తెలిపారు. జగన్, బాబు కూడా రైతులను మోసం చేశారన్నారు. జగన్ పెంచిన విద్యుత్ చార్జీలను చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు రద్దు చేయలేదన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి, గౌస్‌దేశాయ్

జిల్లాను అభివృద్ధి చేయాలంటే సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి పరిశ్రమలు పెట్టాలన్నారు. వేదవతికి రూ.1970 కోట్లు అవసరమైతే రూ.మూడు కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. హంద్రీనీవా ద్వారా చెరువులు నింపేందుకు దిక్కు లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు డబ్బులు ఇవ్వకుండా జిల్లా ఎలా ముందుకు వెళుతుందని ప్రశ్నించారు.

రెండో ఎస్ ఎస్ ట్యాంక్ కోసం పోరాటం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

కర్నూల్ నగరంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్రైం నిర్మాణం కోసం పెద్ద ఎత్తున పోరాటం సాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తెలిపారు. అనేక పోరాటాల ద్వారా చెన్నమ్మ సర్కిల్లో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం జరిగిందన్నారు. అనేక బ్రిడ్జిల నిర్మాణం కోసం సిపిఎం పోరాటం చేసిందన్నారు. విస్తరిస్తున్న కాలనీలో కనీస సౌకర్యాలు లేవని, రాబోయే కాలంలో సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగించాలని మహాసభలో తీర్మానం చేసుకున్నామన్నారు. రాష్ట్ర గత రాజధాని కర్నూలు దిక్కులేకుండా పోయిందన్నారు. ప్రస్తుత రాజధాని విజయవాడకు రైలు సౌకర్యం లేదన్నారు. విజయవాడకు ఇంటర్సిటీ రైలు నడపాలని డిమాండ్ చేశారు. గతంలో ఎంఎ గఫూర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కర్నూలు నగర ప్రజలకు నీరు అందిందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రైతుల, కార్మికుల హక్కులు కాలరాస్తున్నారన్నారు. మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యారన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా, ఆర్ నరసింహులు, కె అరుణ, కె. ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు వై నగేష్, ఎన్.అలివేలు పాల్గొన్నారు.

భూవివాదాల కేసులు ఎందుకు పరిష్కరించరు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

- గ్రీవెన్స్ లో బాధితుల అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ శాఖకు సంబంధించిన భూవివాదాల కేసులు ఎందుకు పరిష్కరించడం లేదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌పై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. అర్జీలు ఏ విధంగా పరిష్కారం అవుతున్నాయని లోటుపాట్లపై రాష్ట్ర స్థాయిలో విశ్లేషణ చేశారన్నారు. రెవెన్యూలో ఎక్కువ శాతం రీఓపెనింగ్ జరుగుతున్నాయని విశ్లేషించారన్నారు. సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, తహసీల్దార్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసు శాఖకు సంబంధించి ప్రాపర్టీ, క్రిమినల్ కేసుల పరిష్కారం చాలా ఆలస్యం అవుతోందన్నారు. టీడ్కో హౌసింగ్ అర్జీలు చాలా ఆలస్యంగా పరిష్కారం అవుతున్నాయన్నారు. ఈ వారంలో టీడ్కో ఇళ్లపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తామని సంబంధిత అధికారులను కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష, జెసి డాక్టర నవ్య

పంటల బీమాపై అవగాహన కల్పించాలి

పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం పంటల బీమా పథకం పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకింద శనగలు, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలకు ఈనెల 15లోపు, వరి పంటకు 31 లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు ఎకరానికి శనగ - రూ 420 లు, జొన్న- రూ 297 లు, వేరుశనగ- రూ 480 లు, ఉల్లిగడ్డ- రూ. 1350లు, వరి పంటకు ఎకరాకు రూ. 630 బీమా ప్రీమియం చెల్లించాలని కలెక్టర్ తెలిపారు. రుణం తీసుకోని రైతులు ఆధార్ కార్డు, పొలానికి సంబంధించిన పత్రాలు, ఫోన్ నెంబరు, బ్యాంక్ పాసుబుక్ మొదటి పేజీ లు సమర్పించి పంటల బీమా చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, టాటా ఎఐజి ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిజిటల్ పాఠాలు

- డిఇఒ కార్యాలయంలో వర్చువల్ స్టూడియో
- 358 పాఠశాలలో వర్చువల్ తరగతులు
- త్వరలోనే ప్రారంభించ నున్న విద్యాశాఖ మంత్రి



డిఇఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ స్టూడియోను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష (ఫైల్)

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్లైన్ ద్వారా డిజిటల్ పాఠాలను బోధించేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లోని విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టులపై నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందం ద్వారా ఆన్లైన్ పాఠాలను బోధించనున్నారు. త్వరలోనే వర్చువల్ తరగతులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ద్వారా ప్రారంభించేందుకు జిల్లా కలెక్టర్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలోని 358 ప్రభుత్వ పాఠశాలల్లో వర్చువల్ తరగతుల ప్రారంభానికి అడుగులు వేస్తున్నారు. ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు కేవలం అక్కడ సబ్జెక్టు ఉపాధ్యాయుల ద్వారా బోధన అందించడమే కాకుండా ఆన్లైన్ ద్వారా నిష్ణాతులైన ఉపాధ్యాయులచే బోధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు వర్చువల్ తరగతులను ప్రారంభించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా అధునాతన టెక్నాలజీతో స్టూడియో నిర్మాణం కూడా చేపట్టారు. జిల్లా కేంద్రం నుండి ప్రతిరోజు కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయుల ద్వారా వర్చువల్ తరగతులను బోధిస్తారు. విద్యార్థులకు నేరుగా పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా వారి సందేహాలను నివృత్తి చేసేందుకు కూడా చర్యలు తీసుకున్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా బోధన

కార్పొరేట్ విద్యాసంస్థల్లోనే విద్యార్థులకు డిజిటల్ తరగతులను నిర్వహిస్తుంటారు. ఆ విద్యాసంస్థల్లో ఉన్న విద్యార్థులకు పోటీగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు వర్చువల్ తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు వర్చువల్ తరగతులు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. విద్యార్థులు పోటీ పరీక్షల్లో కూడా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

ఉత్తమ బోధన అందించడమే లక్ష్యం

- డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్

ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు వర్చువల్ తరగతులు ఎంతో ఉపయోగపడతాయి. ఈ తరగతుల ద్వారా విద్యార్థులు సబ్జెక్టుపై పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి వర్చువల్ తరగతులను ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

- కలెక్టరేట్ ఎదుట గ్రామ వార్డు వాలంటీర్లు ధర్నా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేసిన వాలంటీర్లను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎపి గ్రామ వార్డు సచివాలయ వాలంటీర్లు రాజవిహార్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ధర్నా చేపట్టారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ/వార్డు వాలంటీర్లకు ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం రూ.10000 వేతనం ఇవ్వాలన్నారు, విధుల్లోకి తీసుకొని బకాయిలు ఉన్న జీతాలను విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలోని రెండు లక్షల అరవై వేలమంది గ్రామ వార్డు వాలంటీర్లకు ఇచ్చిన మాటను వెంటనే నిలబెట్టుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడును డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా నాయకులు అంజి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర కార్యదర్శి సాయిఉదయ్ గ్రామ వార్డు సచివాలయం వాలంటీర్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, వాలంటీర్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు

ప్రజల పక్షాన పోరాటాలకు సిద్ధం : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలునగర 3వ మహాసభ విజయవంతంగా ముగిసింది మహాసభలో తీసుకున్న పలు నిర్ణయాలను సోమవారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు వివరించారు. నగర కార్యదర్శి టి రాముడు, కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా, ఆర్.నరసింహులు, కె.సుధాకరప్ప మాట్లాడారు. గత మూడేళ్లలో సిపిఎం నిర్వహించిన పోరాటాలు సమీక్షించుకుని రాబోయే మూడేళ్లకు కర్నూలు నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి తీర్మానం చేసినట్లు తెలిపారు. కర్నూలు నగరం కొత్త కొత్త కాలనీలు ఏర్పడి విస్తరిస్తున్నదని, ప్రజలకు సరిపడా తాగునీరు అందడం లేదన్నారు. అందుకోసం కర్నూలు నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం చెన్నమ్మ సర్కిల్ నుండి లక్ష్మీపురం వరకు, బళ్లారి చౌరస్తా వై జంక్షన్ నుండి ఎల్‌పేట వరకు నంద్యాల చెక్‌పోస్టు నుండి బి తాండ్రపాడు వరకు రోడ్లు వెడల్పు చేసి సెంటర్ లైటింగ్స్ వేయాలన్నారు. నగరంలోని అనేక సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మహాసభలో నూతన నాయకత్వాన్ని 19 మందితో ఎన్నుకునారు.

నూతన న్యూ సిటీ కమిటీ : కర్నూలు నగర కార్యదర్శిగా టి. రాముడు, నగర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఆర్.నర్సింహులు, సిహెచ్ సాయిబాబా, కె సుధాకరప్ప, కె ప్రభాకర్, కె అరుణ , నగర కమిటీ సభ్యులుగా జి.ధనలక్ష్మి, ఎస్. శ్యామల, జి.ఏసు, జెఎండి ఉస్మాన్, ఎస్.మమ్మద్ రఫీ, బి రాధాకృష్ణ, వినశంకర్, ఎస్.హుస్సేన్‌బాష, సిశేషాద్రి, బికె.రామకృష్ణ, ఎంసి ఆనంద్, ఎం.భాస్కర్, వై నగేష్ మహాసభ లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - వెల్దుర్తి

స్కూలుకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో మూడవ తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తి మండలం ఎల్ బండ గ్రామంలో చోటు చేసుకుంది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు ఎల్ బండ గ్రామానికి చెందిన శేఖర్ కుమారుడు ఎల్లకృష్ణ (12) వెల్దుర్తి లోని స్థానిక పద్మ విద్యా వికాస్ పాఠశాలలో చదువుతున్నాడు గత ఐదు రోజుల నుంచి స్కూలుకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు బడికి వెళ్లాలని మందలించడంతో మనస్థాపానికి గురై ఇంట్లో పంటకు కొట్టేందుకు ఉంచిన పురుగుల మందును సోమవారం ఉదయం తాగాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు 108 వాహనంలో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

నిధులను దుర్వినియోగం కానివ్వొద్దు

నగరపాలక సంస్థ ఎదుట పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని శాంతినగర్ కాలనీలో మురుగు కాలువల నిర్మాణం కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.65 లక్షలు మంజూరై రెండేళ్లు గడుస్తున్నా.. కొందరు ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్ల నిధులు మునిగిపోయే ప్రమాదం ఏర్పడిందని.. కమిషనర్ జోక్యం చేసుకొని వెంటనే మురుగు కాలువలు ప్రారంభించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, మల్లికార్జున, ఇదురుబాష,, జైతున్‌బి కోరారు. మురుగు నీటికి వర్షం నీరు తోడై ప్రజలు పడుతున్న ఇబ్బందుల ఫోటోల ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ధర్నాకు ఎం. నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులకు ఇంటి పన్నులు విధించడం పై చూపిస్తున్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. వర్షం వచ్చిన ప్రతిసారి వర్షం నీటికి మురుగు నీరు తోడై రోజుల తరబడి రోడ్లపై నిలవడం వల్ల దుర్వాసనతో అనారోగ్యానికి గురైన వారు.. పిల్లలు వృద్దులు బయటికి వెళ్లేందుకు, బయట నుండి ఇంటికి వచ్చేందుకు అవకాశం లేకుండా, బంధువుల ఇండ్ల దగ్గర ఉండే పరిస్థితి దాపరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాములు, దోమలకు భయపడి దిన దిన గండం నూరేళ్లుగా మా పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదనతో కమిషనర్ దృష్టికి తెచ్చారు.అర్జీని తీసుకున్న అనంతరం అక్కడే ఉన్న సిటీ ప్లానింగ్ అధికారులను, ఇంజనీర్లను కాలువల నిర్మాణం ఎందుకు నిర్మించడం లేదని కమిషనర్ రవీంద్రబాబును ప్రశ్నించారు. తొందర్లో పనులు ప్రారంభిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలు మున్సిపల్ వాహనంలో మాత్రమే వేయాలని, రోడ్లపై చెత్త కనిపించకుండా నగరంలోని మీ కాలనీని ఒక మోడల్ కాలనీగా శాంతినగర్ కాలనీని శుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ మహిళలను కోరారు. ధర్నా కార్యక్రమంలో రాఘవేంద్ర, నాయక్, లక్ష్మి, మస్తాన్‌బి, జైతున్‌బి, ఎం.యాకోబ్, సివి వర్మ, ఎస్ ఆర్ గౌడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు కార్పొరేషన్ ముందు ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పుల్లారెడ్డి

వలసల నివారణకు ఉపాధి పనులు : ఎపిఒ హేమచంద్ర

ప్రజాశక్తి-తుగ్గలి

మండలంలోని అన్ని గ్రామాలలో వలసలను నివారించడానికి జాతీయ ఉపాధి హామీ పథకం పనులను చేపడుతున్నట్లు జాతీయ ఉపాధి హామీ పథకం ఎపిఒ హేమచంద్ర అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ ఆయా గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించామన్నారు. ఎక్కడ కూడా వలసలు వెళ్లకుండా అదే గ్రామంలోని పనులు కల్పించాలని ఆయన వారికి తెలిపారు. గ్రామాలలో వలసలు వెళితే టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యత వహించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో నిధులు ఎంత మాత్రం కొరత లేదని, అందుకు ప్రతి గ్రామంలో కచ్చితంగా ఉపాధి పనులను కల్పించాలని కోరారు

పరిస్కార వేదికలో ఆరు వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-సి బెళగల్

తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి సోమవారం పరిస్కార వేదిక నిర్వహించగా ఆరు వినతులు వచ్చాయి. భూ సమస్యలు పరిష్కరించాలని ముగ్గురు రైతులు, ఇతర సమస్యలు పరిష్కరించాలని మరో ముగ్గురు వినతులు ఇచ్చారు. ప్రతి వినతికి పరిస్కారం దొరుకుతుందని తహసీల్దార్ బాధితులకు హామీనిచ్చారు. ప్రతి సోమవారం నిర్వహించే పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మండల ప్రజలకు సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 16 అర్జీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర ప్రజల అభ్యర్థనల మేరకు వీధుల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 16 అర్జీలను కమిషనర్ స్వీకరించారు. వాటి పరిష్కారానికి చట్ట పరిధిలో తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆరోగ్యధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఒలు జునైద్, ఇశ్రాయేలు, ఎంఇలు శేషసాయి, సత్యనారాయణ, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతన్న కమిషనర్ రవీంద్రబాబు




వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి బిందు మాధవ్

విచారించి న్యాయం చేస్తాం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 94 ఫిర్యాదులు

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి జి విందు మాధవ్ అన్నారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జి. బిందుమాధవ్ సోమవారం ప్రజల ఫిర్యాదులను స్వీరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఫిర్యాదుల వినతులు అందాయి. ఎస్‌పి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 94 ఫిర్యాదులు వచ్చాయి.



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న రాఘవేంద్ర

స్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలంలోని ఉల్చాల గ్రామంలో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా నాయకులు అబ్దుల్లా, మండల నాయకులు సురేష్, అంజి, సాయి ఉదయ తో కలిసి వినతిపత్రం అందజేశారు.రాఘవేంద్ర మాట్లాడుతూ కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని హిందూ స్మశాన వాటికకు స్థలం కేటాయించాలన్నారు. 60 సంవత్సరాల కిందట గ్రామంలోని సర్వే నంబర్ 443లో అప్పుడు జనాభాకు అనుగుణంగా ఒక ఎకరా భూమి కేటాయించారన్నారు. అందులో కూడా 80 సెంట్ల స్థలం బండ ఉన్న కారణంగా దానిని ఉపయోగించుకోకుండా ఉన్న స్థలాన్ని ఉపయోగిస్తూ వచ్చారని తెలిపారు. ఈ భూమిలో కూడా ఇప్పుడూ ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారన్నారు. వెంటనే గ్రామ జనాభాకు అనుగుణంగా రెండు ఎకరాల స్థలం స్మశానం కోసం కేటాయించాలని, స్మశానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

నీటి కొరతను తీర్చండి : సిపిఎం

ప్రజాశక్తి - మంత్రాలయం



ఖాళీ బిందెలతో ధర్నా చేపడుతున్న నాయకులు

గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయ రాజు, నాయకులు తిక్కన్న, రాముడు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని చిలకలడోణ గ్రామంలో గ్రామస్తులతో ఖాళీ బిందెలను చేత పట్టుకుని రోడ్డుపై ధర్నా చేపట్టి, బైఠాయించారు. గ్రామస్తులతో కలిసి వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి, మండల ఇన్‌ఛార్జి విశ్వనాథ్ రెడ్డికి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎఇ వెంకటరాముడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిలకలడోణ గ్రామంలో సుమారు 15 నెలలుగా తాగు నీరు సరిగా రాకున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారని విమర్శించారు. గ్రామంలో తాగునీరు లేక వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మంత్రాలయం నుంచి చిలకలడోణ గ్రామం వరకు గతంలో వేసిన ఎస్ఎస్ పైపులైన్ ద్వారా నీళ్లు రావడం లేదని, పాత పైపులైన్ తొలగించి కొత్త పైపు లైన్ వేయాలని కోరారు. ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని, ప్రతి కాలనీలో నీటి చిన్న ట్యాంకులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, ఒక వేళ విద్యుత్ కోతలు ఉంటే సమయ పాలన పాటించాలని సూచించారు. నెలకు ఒకసారి ఎస్ఎస్ ట్యాంకును శుభ్రం చేయాలని, గ్రామస్తులకు నీటిని సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు బి.రాముడు, మాజీ సర్పంచి బి.నర్సన్న, ఎమ్.డి.షఫీ, వెంకటేష్, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు బి.పెద్దయ్య, వై.మాదన్న, హోటల్ వెంకటరెడ్డి, ఉస్కప్ప, రంగమ్మ, పెద్దయ్య, సిపిఎం కార్యకర్తలు రాజు, దేవపుత్ర, దానియేలు, ప్రకాశం, అంజి, వినోద్ కుమార్, మహానంది, నారాయణ పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే విరుపాక్షి

- పెద్దమ్మ అవ్వ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ఆస్పరి


ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

మండలంలోని కైరుప్పల గ్రామంలో వెలసిన శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ అవ్వ ఆలయ నిర్మాణం కోసం ఎమ్మెల్యే విరుపాక్షి రూ.లక్ష, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణ మోహన్ దంపతులు రూ.16 వేల విరాళం అందజేశారు. ముందుగా సర్పంచి తిమ్మక్క, ఎంపిటిసి లక్ష్మి, వైసిపి నాయకులు బిటెక్ వీరభద్రి, రంగన్న, జికె.వీరేష్ లు ఎమ్మెల్యేకు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. జడ్‌పిటిసి దొరబాబు, మండల కన్వీనర్ పెద్దయ్య, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన, మండల మాజీ కన్వీనర్ రామాంజినేయులు, సిఇఒ అశోక్, సర్పంచులు తోయజక్షప్ప, వెంకటేష్, నాయకులు దత్తాత్రేయ రెడ్డి, ప్రకాష్, శివ, లక్ష్మన్న, రామలింగ, రాజన్న గౌడ్, కౌలుట్ల పాల్గొన్నారు.

సభ్యత్వం పెంచడమే లక్ష్యం

- టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రి చంద్ర బాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ నియోజకవర్గంలో టిడిపి సభ్యత్వ నమోదును విస్తృతం చేస్తూ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా శ్రమిస్తామని టిడిపి సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరే సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. సోమవారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు ప్రక్రియ మొదలైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ఒంటెత్తు పోకడతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు విశ్వసించి పట్టం కట్టారని తెలిపారు. ప్రజల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో మార్పు మొదలైందని, ఇప్పటి నుంచి మరో విధంగా టిడిపి కార్యవర్గం వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వం తీసుకొని పార్టీ బలోపేతానికి సహకరించాలని కోరారు. టిడిపి సీనియర్ నాయకులు ఫక్రుద్దీన్ సాహెబ్, సౌదీ రావుఫ్, మాజీ కౌన్సిలర్ రామచంద్రప్ప, మల్లికార్జున, ఎన్‌బికె నాగరాజు, మద్దికెర రామకృష్ణ, వాల్మీకి మల్లేశ్వరప్ప, నారాయణపురం షాషావలీ, జి.ఇస్మాయిల్, మదిరే మాజీ సర్పంచి గోవింద ప్ప, రమేష్, శ్రీనివాస్, నాగ రాజ్, తిమ్మప్ప, ప్రేమ్ ఉన్నారు.


సభ్యత్వం ఇస్తున్న మదిరే సూరం భాస్కర్ రెడ్డి

'నకిలీ'ల తొలగింపు...

- అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలేవీ..?

- నకిలీలపై ముందే చెప్పిన ప్రజాశక్తి

ప్రజాశక్తి - ఆలూరు

విద్యుత్ శాఖలో 'నకిలీ సర్టిఫికెట్'తో ఉద్యోగం పొందిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగించారు. వారివి 'నకిలీ సర్టిఫికెట్లు' అని ప్రజాశక్తి ముందు నుంచి చెబుతూనే ఉంది. చివరికి కదలిన అధికారులు 'నకిలీ'లను తొలగించారు.


కోగిలతోట సబ్ స్టేషన్

విద్యుత్ శాఖలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో ఎలాంటి నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆపరేటర్ పోస్టులను అధికారులు, కాంట్రాక్టర్లు చేతివాటంతో భర్తీ చేశారు. నకిలీలను నియమించడంతో అర్హులైన అభ్యర్థులు నష్టపోతున్నారు. మార్చి 2024 నుంచి వరుస కథనాలతో తెలుపుతూ నియమితులైన వారి సర్టిఫికెట్లు నకిలీవని ప్రజాశక్తి ముందే చెప్పిన సంగతి తెలిసిందే.

ఆలూరు నియోజకవర్గంలోని హొళగుంద మండలం కోగిలతోట గ్రామ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా.. ఎలాంటి నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా విద్యుత్ శాఖలో ఆపరేటర్ పోస్టుల్లో అధికారులు, కాంట్రాక్టర్లు కాసులకు కక్కుర్తి పడి అభ్యర్థులను నియమించారు. నియమించిన అభ్యర్థుల్లో నకిలీ సర్టిఫికెట్లు ఉన్నట్లు ప్రజాశక్తి చెప్పినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. ప్రజాశక్తిలో వరుస కథనాలు రావడంతో కదిలిన ఉన్నతాధికారులు స్పందించారు. నియామకమైన వారి సర్టిఫికెట్లను నిజనిర్ధారణ కోసం డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ప్రభుత్వ ఐటిఐ విజయవాడ వారికి పంపారు. నియామకమైన వారి సర్టిఫికెట్ నకిలీ అని గత నవంబర్‌లో నిర్ధారించారు. ఫిబ్రవరి 2024 నుంచి అక్టోబర్ వరకు విధులు నిర్వహించిన అభ్యర్థులకు జీతభత్యాలను రికవరి చేసి వారిపై చర్యలు తీసుకోవాలి.

నకిలీ సర్టిఫికెట్ల నిర్ధారణతో తొలగింపు

- ఎస్.సంతోష్, విద్యుత్ డిఇఇ, ఆలూరు



కోగిలతోట సబ్ స్టేషన్‌లో ఆపరేటర్లుగా పనిచేస్తున్న ఇద్దరివి నకిలీ సర్టిఫికెట్లు. నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని తొలగించాం.

చర్యలు తీసుకోవాలి

- మైనా, డివైఎఫ్ఐ నాయకులు, ఆలూరు



ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా నోటిఫికేషన్ ఇవ్వకుండా నకిలీ సర్టిఫికెట్లతో నియమించిన అధికారులపై చర్యలు తీసుకొని కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలి. క్రిమినల్ కేసు నమోదు చేయాలి. లేకపోతే నిరుద్యోగ యువకులు, యువజన సంఘాలతో ఆందోళన చేపడతాం.


దీక్ష చేపడుతున్న రైతు

భూమి కోసం ఆమరణ నిరాహార దీక్ష

ప్రజాశక్తి - మంత్రాలయం

తమ భూమి తమకు కావాలంటూ రైతు గంగ నాయక్ సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. రైతు గంగ నాయక్ మాట్లాడుతూ... మండలంలోని పరమాన్‌దొడ్డి గ్రామంలో తమకు సంబంధించిన భూమిని వైసిపి ప్రభుత్వంలో ఇతరులకు కేటాయించారని, దీనిపై ఏళ్లుగా పోరాటం చేస్తున్నానని చెప్పారు. అధికారులు అన్నదమ్ముల మధ్య తగాద పెట్టి చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబును, నారా లోకేష్‌ను గతంలో కలిసి గోడు వినిపించానని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్లానని చెప్పారు. కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థులు సహకరించాలని కోరారు.

ఇన్‌ఛార్జి ఎపిఎంగా నరసన్న

ప్రజాశక్తి- దేవనకొండ



దేవనకొండ మండల పొదుపు మహిళల ఇన్‌ఛార్జి ఎపిఎంగా ఎం.నరసన్న సోమవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆస్పరి మండలంలో రెగ్యులర్‌గా పనిచేస్తూ, ఇన్‌ఛార్జి ఎపిఎంగా దేవనకొండ మండలంలో జనార్ధన్ బాధ్యతలు నిర్వర్తించేవారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిపాలన సౌలభ్యం కోసం డిఆర్‌డిఎ పీడీ నాగ శివ లీల సూచనల మేరకు హెచ్‌డిసిసిగా పని చేస్తున్న నరసన్న బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... పొదుపు సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధికి, రుణాల రికవరీ, చెల్లింపులపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు.

వృద్ధురాలి వెండి కడియాలు చోరీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని మొట్టి వీధికి చెందిన వృద్ధురాలు బండా సన్నమ్మ చేతి నుంచి ఆరు వెండి కడియాలు చోరీకి గురైనట్లు బాధితురాలి కుమారుడు బండా రంగస్వామి, కుటుంబ సభ్యులు తెలిపారు. వారు వివరాల మేరకు... గోనెగండ్లలోని మొట్టి వీధిలో బండా రంగస్వామి తన భార్య పద్మ, తన తల్లి వృద్ధురాలైన సన్నమ్మతో కలిసి ఉంటున్నారు. సోమవారం ఉదయం 6 నుంచి 8 గంటల సమయంలో సన్నమ్మ బయట కూర్చున్నారు. ఆ సమయంలో సన్నమ్మ చేతికి ఉన్న ఆరు వెండి కడియాలు (40 తులాలు), వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుంది. వాటిని గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. తాను, తన తల్లిని టిఫిన్ చేయడం కోసం ఇంట్లోకి పిలిచినప్పుడు చేతికి వెండి కడియాలు లేని విషయం గమనించి అడిగినట్లు రంగస్వామి తెలిపారు. 85 ఏళ్ల వయోభారం ఉన్నందున తన తల్లి తనకేమీ తెలియదని చెప్పడంతో పాటు ఎవరినీ గుర్తించలేక పోతున్నారని చెప్పారు. పోలీసులు ఘటనపై విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం చేద్దాం : ఎపిఎం

ప్రజాశక్తి - హొళగుంద

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం చేద్దామని ఎపిఎం సూర్యప్రకాష్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ హనుమంతయ్య తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయం ముందు మహిళలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన అమ్మాయిలకు మాత్రమే పెళ్లిళ్లు చేయాలని, 21 ఏళ్లు నిండిన అబ్బాయిలకే పెళ్లిళ్లు చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపితే అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఎన్నికల ముందే రాజకీయాలు

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాజకీయాలు ఎన్నికల ముందు ఉంటాయని, ఇప్పుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణానికి చెందిన పెద్ద కటికె వ్యాపారులు టిడిపిలో చేరారు. టిడిపి నాయకులు బందే నవాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ సమక్షంలో పెద్ద కటికె వ్యాపారులు ఇబ్రహీం, బందే నవాజ్, రహంతుల్లా, ఇలియాస్, జాకీర్, సత్తార్‌తో పాటు వారి అనుచరులు దాదాపు 100 కుటుంబాలు టిడిపిలో చేరారు. పెద్ద కటిక వీధి నుంచి భారీ ర్యాలీగా వచ్చారు. ముందుగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డికి పెద్ద కటికె వ్యాపారులు భారీ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎవరు, ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలు పెట్టలేదని, తాము స్వచ్ఛందంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ సమక్షంలో టిడిపిలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ మాట్లాడారు. పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి సహకరించినందుకు పెద్ద కటికె వ్యాపారులు పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. ఎవరినీ బెదిరించి పార్టీలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొందరు వైసిపి నాయకులు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని తెలిపారు. పెద్ద కటికెలకు 2014లో స్లాట్ హౌస్ మంజూరు చేయించామని, వైసిపి ప్రభుత్వం పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని చెప్పారు. గతంలో మంజూరు చేసిన పనులు సక్రమంగా చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. గతంలో తన తండ్రి బీవీ.మోహన్ రెడ్డికి, వీరికి అనుబంధం ఉందని తెలిపారు.


బీవీ సమక్షంలో టిడిపిలో చేరుతున్న పెద్ద కటికె వ్యాపారులు

'ట్రూ అప్' బాదుడే బాదుడు

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

ట్రూ అప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై 'బాదుడే బాదుడు'కు పాల్పడుతోందని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాకముందు చెప్పింది ఒకటి.. చేసేది ఒకటని విమర్శించారు. సోమవారం ఆలూరు ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీల పెంచినట్లు చంద్రబాబు గగ్గోలు పెట్టారని, అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పారని తెలిపారు. ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం ఏమంటారని ప్రశ్నించారు. చెప్పుకోవడానికి ఏమీ లేక ప్రతినెలా పింఛను పంపిణీలో పాల్గొనడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు కప్పి పుచ్చుకుంటూ మోసం చేస్తుంటే ప్రజలను ఏకం చేసి రోడ్డెక్కి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మాజీ ఎంపిటిసిలు రాంగోపాల్, భాస్కర్, సర్పంచి ఎల్లప్ప, మండల కో కన్వీనర్ వీరేష్, వైసిపి యువ నాయకులు ఎస్‌కె.గిరి, ప్రకాష్, వెంకటేశులు పాల్గొన్నారు.

మంత్రాలయం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని, బాబు ష్యూరిటీతో బాదుడుకు గ్యారంటీ అంటూ సిద్ధరామయ్యారని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం మండలంలోని రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. చంద్రబాబు పాలనపై అనుకూలంగా 'ఎల్లో మీడియా' తెగ ప్రచారం చేస్తోందని, వాస్తవ పరిస్థితులు వేరుగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఎక్కడకు వెళ్లినా 'మేము అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామ'ని బూటకపు హామీ ఇచ్చి, అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రెండు సార్లు పెంచి ప్రజలపై భారం వేశారని మండిపడ్డారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారి 'బెల్ట్' తీస్తామంటూనే రాష్ట్రంలో టిడిపి కార్యకర్తల కోసం ఊరూరా బెల్ట్ షాపులు తెరిపించి 'ఉపాధి' చూపుతున్నారని విమర్శించారు. వైసిపి సోషల్ మీడియాను అణగదొక్కాలని సోషల్ మీడియా యాక్టివిస్టుల పట్ల పోలీసులు వేధింపులకు పాల్పడడం తగదని హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమం 'తెలుగు తమ్ముళ్లకు' కాకుండా ప్రజలకైతే సహకరిస్తామని, లేదంటే ప్రజల్లోకి వెళ్లి ఎండ గడతామని హెచ్చరించారు. వైసిపి నాయకులు జి.భీమిరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, మురళీ రెడ్డి, చెట్నహళ్లి సర్పంచి అంజినేయులు, మాజీ సర్పంచులు అల్లింగప్ప, వెంకటేష్, సింగరాజనహళ్లి మాజీ సర్పంచి నర్సప్ప, ఎంపిటిసి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని వైసిపి వీరశైవ లింగాయత్ విభాగ రాష్ట్ర అధ్యక్షులు వై.రుద్ర గౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, పట్టణ అధికార ప్రతినిధి సునీల్ కుమార్, కౌన్సిలర్ కామర్తి నాగేశప్ప, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు విరుపాక్షి రెడ్డి, ఎల్ఎల్‌సి మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వైసిపి నియోజకవర్గ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, నిరసన చేపట్టారు. విద్యుత్ ఎడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'బాబు ష్యూరిటీ.. భవిష్యతు గ్యారంటీ' అని టిడిపి నేతలు ప్రచారం చేశారని, వాస్తవ పరిస్థితి చూస్తే 'బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ' అనేది స్పష్టంగా తెలుస్తోందని తెలిపారు. ఆరు నెలల్లో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు వాతలు పెట్టిన చంద్ర బాబు విద్యుత్ చార్జీలు పెంచి, తమపై నిందలు మోపడం దారుణమన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ప్రచారంలో చెప్పి ఇష్టానుసారంగా పెంచుతున్నారని దుయ్యబట్టారు. విద్యుత్ రంగం పెను సంక్షోభంలో కూరుకుపోవడానికి చంద్రబాబే ప్రధాన కారకుడని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు, స్కూల్ ఫీజుల మోతకు తోడు విద్యుత్ చార్జీల భారంతో సామాన్యుల నడ్డి విరుగుతోందన్నారు.


ఆలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి


మంత్రాలయంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి


ఎమ్మిగనూరులో నిరసన తెలియజేస్తున్న నాయకులు

పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని న్యూ ఇందిరా నగర్‌లో ఏర్పాటు చేసిన వీధి దీపాల ఏర్పాటు పనులను పరిశీలించారు. డిఇఇ నీరజ, ఎఇ మదన్ కుమార్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శిల్పా కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

- దేగులపాడు సర్పంచి నీలకంఠ

ప్రజాశక్తి - చిప్పగిరి



గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే, నిరుపేదలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉండాలంటే అది ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని దేగులపాడు సర్పంచి నీలకంఠ తెలిపారు. సోమవారం ఆయన చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్ర అన్ని రంగాల్లోనూ వృద్ధి చెందుతుందన్నారు. మండలంలో ఉన్న 13 పంచాయతీల్లో గతంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేసుకోలేకపోయామని తెలిపారు. టిడిపి ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ సహకారంతో గ్రామాలన్నీ అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని చెప్పారు. జనాభా ప్రాతిపదికన గ్రామాలకు నిధులను మంజూరు చేయిస్తున్నందుకు ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌ఛార్జి అనేది అధిష్టాన పెద్దలు చూసుకునేదని, ఇప్పటికైతే వీరభద్ర గౌడ్ ఉన్నారని చెప్పారు. భవిష్యత్తులో పార్టీ పెద్దలు ఏ నిర్ణయం తీసుకున్నా వారి ఆదేశాల మేరకే నడుచుకోవాలన్నారు.

సన్నబియ్యం సరఫరా చేయాలి

- విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ పాఠశాలల్లో, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం సరఫరా చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు నరసన్న, వీరేష్ యాదవ్, ఉసేన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మాచాని బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కుమార్, అజయ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం వేగవంతం

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం'లో వచ్చిన అర్జీలను ఏ అధికారీ నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆదోని పట్టణం వైఎస్ఆర్ నగర్ 3వ లైన్‌లో తాగునీటి పైపు లైన్ లేదని, కాలనీ సమీపంలో ఉన్న బోరు కూడా సరిగ్గా పని చేయడం లేదని, తమ కాలనీ సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరారు. సర్వే నెంబర్ 266లో 2.63 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, ప్రస్తుతం ఆ భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని పెద్దకడబూరు మండలం హులికన్వి గ్రామానికి బి.దత్తాత్రేయకు కోరారు. సర్వే నెంబర్ 17ఈలో 1.26 ఎకరాల భూమి ఆన్‌లైన్, అడంగల్‌లో నమోదు చేయాలని ఆదోని మండలం గనేకల్ గ్రామానికి చెందిన ఆంజనేయ విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఇఇ వెంకట రమణ రెడ్డి ఉన్నారు.


వినతి అందజేస్తున్న సూర్య

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి : దేవాలయ భూములను అన్యాక్రాంతం చేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ రీజినల్ ఇన్‌ఛార్జి మోపురి సూర్య కోరారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ హిందూ దేవాలయాల భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకొని వాళ్ల స్వార్థానికి అమ్ముకున్నారని తెలిపారు. దళిత, గిరిజనులు జీవించడానికి భూములు లేక వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్లి ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని దేవాలయాల భూములను దళిత, గిరిజనుల జీవనోపాధి కోసం చట్టబద్ధంగా ఇవ్వాలని కోరారు.

వీరభద్ర స్వామి, కాళికాదేవి కల్యాణోత్సవం

ప్రజాశక్తి - ఆస్పరి


వీరభద్ర గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మండలంలోని కైరుప్పల గ్రామంలో ఆలయంలో సోమవారం శ్రీవీరభద్ర స్వామి, కాళికా దేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా టిడిపి నాయకులు బసవరాజు, వీరేష్, శేషిరెడ్డి, రామకృష్ణ, వీరేష్‌లు ఆయనకు శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పేదకూ ఎన్‌టిఆర్ భరోసా ద్వారా ఇల్లు మంజూరు చేసి కట్టిస్తామన్నా రు. అర్హులై ఇల్లు, రేషన్ కార్డు, పింఛను రానివారు సచివాలయలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆలూరు మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ శాలి సాబ్, టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, సతీష్, మధు, యుగంధర్, హనుమంతు రెడ్డి, మల్లికార్జున, మహేష్, మారేష్ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో

లోటుపాట్లకు తావివ్వొద్దు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎలాంటి లోటు పాట్లూ లేకుండా.. సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం ఆదోని రెవెన్యూ భవన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లో 55 నీటి సంఘాలు ఉండగా.. వాటిలో మేజర్/మీడియం సంఘానికి 12 టిసిలు, మైనర్ సంఘానికి 6 టిసిలు ఉంటాయన్నారు. డివిజన్‌లో మేజర్ సంఘాలు 39, మీడియం సంఘాలు 5, మైనర్ సంఘాలు 11 ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 5న నోటిఫికేషన్ రానున్నట్లు తెలిపారు. 8న ప్రాదేశిక నియోజకవర్గం, వాటర్ యూజర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు ఉంటాయని చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 11న, ప్రాజెక్ట్ కమిటీలకు 14న ఎన్నికలు ఉంటాయని తెలిపారు. డివిజన్‌లోని సాగునీటి సంఘాల ఎన్నికల కోసం ఆదోని డివిజన్‌లో 1,201 మంది సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సైలేశ్వర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షఫీవుల్లా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - కౌతాళం



మండలంలోని మురళి గ్రామానికి చెందిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన ఈరన్న, సిద్ధమ్మ దంపతులు దేవుని దర్శనం కోసం కర్ణాటకలోని రాయిచూర్ పట్టణానికి వెళ్లారు. సోమవారం తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు ఇద్దరూ గాయపడ్డారు. ఆస్పత్రికి తరలించగా సిద్ధమ్మ (30) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. వీరికి ముగ్గురు సంతానం. ఈరన్న ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

క్రమశిక్షణతో ఉన్నత చదువులు

- జిసిడిఒ స్నేహలత

ప్రజాశక్తి - ఆలూరు

విద్యార్థులు క్రమ శిక్షణతో ఉన్నత చదువులు చదివి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని జిసిడిఒ స్నేహలత తెలిపారు. సోమవారం ఆలూరు కెజిబివిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన మెనూ పాటించాలని, తాగునీరు, వంట గదుల్లో శుభ్రత పాటించాలని ప్రిన్సిపల్ సుహాసినికి సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.


మాట్లాడుతున్న జిసిడిఒ స్నేహలత

వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సామాజిక పింఛన్లలో కోత విధించిన కడిమెట్ల సచివాలయ వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు తాలూకా కార్యదర్శి రాముడు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, రూరల్ కార్యదర్శి శైలజ డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులందరికీ సామాజిక భద్రత పింఛన్లు అందజేస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రచారం చేస్తోందన్నారు. మండలంలో గౌరవ వేతనంతో పని చేస్తున్న వికలాంగులు, వితంతువులైన గ్రేషమ్మ, మెహరూన్ బీ, కుల్లూరు మల్లేశ్వరి పింఛన్లను తొలగించారని తెలిపారు. రాజకీయ దురుద్దేశంతోనే తొలగించాలని విమర్శించారు. ఎలాంటి ఆదేశాలూ, ఉన్నతాధికారుల నిర్ణయాలు లేకుండా తొలగించిన సచివాలయ వెల్ఫేర్ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఆర్ఐకి వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని పాత బస్టాండ్ మైదానంలో నిర్మిస్తున్న మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు గోపాల్, తిప్పన డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, నాగరాజు, నాగేంద్ర, వెంకటేష్‌తో కలిసి అసిస్టెంట్ కమిషనర్ అనుపమకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవిష్యత్తులో మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చే నిర్మాణం పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు. దాదాపు రూ.33 కోట్లతో నిర్మిస్తున్న మున్సిపల్ కాంప్లెక్స్ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. లబ్ధిదారులు ఇప్పటికే గుడ్ విల్ ద్వారా సుమారు రూ.4 కోట్లు మున్సిపాలిటీకి చెల్లించారని చెప్పారు. మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిచిపోయి నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదో తెలియడం లేదని అన్నారు. నిర్మాణం పూర్తయితే మున్సిపాలిటీకి సంవత్సరానికి కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఆగిపోయిన పనులను ప్రారంభించి మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చాలని డమాండ్ చేశారు. లేకపోతే లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు